నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

ఇల్లు పైననున్న చిల్లు కానబడదు
మందుటెండలోన మనకు నెపుడు
వర్షకాలమందు బయటపడు నదియు
మనిషి బుద్ధి గూడ మహిన నిటులె
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

విలేకరులు కావలెను
నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.
పూర్తి వివరాలకు
తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.

సంచిక 52 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | ఆగస్టు 20, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

● బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి ● వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి ● బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి సూచన



**హైదరాబాద్,ఆగస్టు 19 :** అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. ఓ-హూఓఇలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. కింద రూ.4,463 కోట్ల విలువైన

మిగతా2లో...



## ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

భూసేకరణలో బాధితులను పట్టించుకోరా..?
కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఆగస్టు 19 :** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలం గాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృధా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను

మిగతా2లో...



## లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్టు 19 :** లోక్‌సభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర

మిగతా2లో...

## సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం



- ప్రజలతో మమేకమే లక్ష్యంగా పీఏసీ సమావేశం

**నిజామాబాద్, ఆగస్టు 19 :** జిల్లా కేంద్రంలోని దుబ్బలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పీఏసీ సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

మిగతా2లో...


## కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

● కోవిడ్ రికార్డుల దాపరికం నిజమేనని ఒప్పుకోలు ● నవంబర్ 12న శిక్ష ఖరారు చేయనున్న కోర్టు ● ప్రపంచవ్యాప్త తప్పిదాన్ని చైనాపైకి నెట్టే ప్రయత్నంవెల్లడవుతున్న వాస్తవాలు..అమెరికా ఫెడరల్ కోర్టులో నేరాన్ని అంగీకరించిన ఫౌచీ సలహాదారు డేవిడ్ మోరెన్స్



**గ్రీన్‌బెల్ట్ (మేరీల్యాండ్),ఆగస్టు 19 :** కోవిడ్ మహమ్మారి చైనా లేబొరేటరీస్ నుంచి ప్రపంచంలోకి విస్తరించిందని అమెరికా చేసిన ప్రచారం అవాస్తవమని తేలిపోయింది. తాను చేసిన తప్పుల్ని చైనా మీదకు నెట్టి, ఆ దేశాన్ని అభాసుపాలు చేయాలనే ప్రయత్నాల గుట్టురట్టు అయ్యింది. కోవిడ్ సమయంలో అంతటి దుష్ప్రచారం తమ దేశంపై జరుగుతున్నా, చైనా భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టిందే తప్ప, ఏనాడు ఏ దేశాన్ని నిందించలేదు. దీనితో భారతదేశంలో కూడా చైనా లేబరేటరీల నుంచే కోవిడ్ మహమ్మారి వచ్చిందనే ప్రచారాన్ని

మిగతా2లో...



2లో

## ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

## 22/ఏ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

● ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి ● పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి ● అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం



**హైదరాబాద్,ఆగస్టు 19 :** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఏ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఏ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న

మిగతా2లో...

## అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట


- ఎన్నికల సంఘం
సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం



2లో

## పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు
సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



2లో

## ప్రశ్నిస్తే..అరెస్టులా?

● మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని హౌస్ అరెస్ట్
● నివాసాల వద్ద భారీగా మోహరించిన పోలీసులు



**హైదరాబాద్,ఆగస్టు 19 :** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదారబాద్ సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసానిని పోలీసు లు హౌస్ అరెస్టు చేశారు. కోకాపేట్‌లోని హరీశ్‌రావు నివాసం వద్ద నార్సింగి ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దారుణమన్నారు.

కోకాపేటలోని హరీశ్‌రావు నివాసానికి నార్సింగ్ పోలీసులు వెళ్లి, వారిని బయటికి వెళ్లకుండా ముందుగానే హౌస్ అరెస్ట్ చేశారు. అరెస్ట్ విషయాన్ని తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

మిగతా2లో...

# 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలు ఏమిటి?
గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

# ప్రశ్నిస్తే..అరెస్టులా?

(మొదటి పేజీ తరువాయి)

అక్కడికి చేరుకుని అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులకు ఆస్పత్రి సందర్శనకు వెళ్లకుండా ఎలాంటి అనుమతి లేదని చెప్పడం సరికాదన్నారు. ఆస్పత్రుల్లోని డొల్లతనం, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతా యనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అరెస్టులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై నిరంతరం బీఆర్‌ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు.

### ఎమ్మెల్యే తలసాని హౌజ్ అరెస్ట్

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయనతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలను కూడా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకవైపు ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ మరోవైపు అక్రమ నిర్బంధాలు, తప్పుడు కేసులతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు ఆస్పత్రిని సందర్శించకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆస్పత్రి సందర్శనకు వెళ్తామంటే ప్రభుత్వానికి ఎందుకంత భయమని నిలదీశారు. అక్రమ నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలనే ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇలాంటి చర్యలకు త్వరలోనే ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# అర్హులు ఓటరు జాబితాలో..అనర్హులు జాబితా బయట

**హైదరాబాద్,ఆగస్టు 19 :** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్‌ఐఆర్ సర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆర్‌ఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు.
అనామలీస్, నో- మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

క్లకెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు.

ఫారం 6, 6ం, 7, 8పై కెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చేయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో- మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

### - సంస్కరణలపై సుప్రీంలో విచారణ



**న్యూఢిల్లీ,ఆగస్టు 19 :**నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# టేబుల్‌పై డిఎంకె అవినీతి ఫైల్స్

### వాటిని అప్పుడే తెరిచేలా చేయకండి

### తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై,ఆగస్టు 19 :**ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

# కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

(మొదటి పేజీ తరువాయి)

మోడీ సర్కారు నిరోధించేచర్యలు చేపట్టలేదు. కాలం గిర్రున తిరిగి, నిజం నిలకడ మీద ప్రపంచానికి తెలిసి వస్తున్నది. అసలు కోవిడ్ వైరస్‌పై ప్రయోగాలు చేసింది అమెరికానే అనీ, ఆ దేశం దానికోసం నిధుల్ని కూడా సమకూర్చిందని ఆ ఆపరేషన్‌లో భాగస్వాములు అయిన మాజీ అధికారులు ఇప్పుడు స్పష్టంచేస్తున్నారు. దీనిపై అమెరికాలో నమోదైన కేసుల్లో ఇప్పటికే పలువురు అరెస్టు అయ్యారు. కరోనా పరిశోధనలకు అమెరికా నిధులు సమకూర్చిం దని ఆ దేశ మాజీ అధికారి అంగీకరించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాన వైద్య సలహాదారు డాక్టర్ ఆంథోనీ ఫౌచీ వద్ద సలహాదారుగా పని చేసిన డేవిడ్ మోరెన్స్ ఈ విషయాన్ని బహిరంగంగా వెల్లడించారు.కొవిడ్ వైరస్‌పై పరిశోధనలకు వెచ్చించిన నిధుల రికార్డులు, ఇతర పత్రాలను అధికారిక సిస్టమ్‌లో కాకుండా, చట్టాల నుంచి తప్పించుకోవడానికి వ్యక్తిగత ఇ-మెయిల్స్‌లో దాచినట్లు పేర్కొన్నారు. కొవిడ్ పరిశోధన గ్రాంట్లకు సంబంధించి ఏప్రిల్ 2020 నుంచి ఏజెన్సీకి అందిన ప్రజా రికార్డుల అభ్యర్థనలను అడ్డుకున్నట్లు డేవిడ్ మోరెన్స్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు ఆయనను విచారించగా.. తన తప్పును అంగీకరించారు. కోవిడ్ మహమ్మారి మొదలైన సమయంలో ఆంథోనీ ఫౌచీ 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్' (ఎన్‌ఐఏఐడీ) అధిపతిగా ఉండగా, తాను సహాయకుడిగా ఉన్నానని ఫెడరల్ కోర్టులో జరిగిన విచారణ సందర్భంగా మోరెన్స్ పేర్కొన్నారు. వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్-19 ఉద్భవించిందన్న ఆరోపణల నేపథ్యంలో.. గబ్బిలాల్లోని కరోనా వైరస్‌లపై చేస్తున్న పరిశోధన గ్రాంటును నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ రద్దు చేయాలని నిర్ణయించుకుంది.అయితే, ఆ గ్రాంటును పునరుద్ధరించడానికి ల్యాబ్ నుంచి కొవిడ్ లీక్ అయిందన్న విషయాన్ని తప్పుడు కథనంగా చూపేలా సాయం చేస్తానని మోరెన్స్ చైనాలోని యాజమాన్యానికి హామీ ఇచ్చారని ప్రాసిక్యూటర్లు తెలిపారు. అందులో భాగంగానే కరోనా సహజసిద్ధంగా, జంతువుల నుంచే వ్యాప్తి చెందిందనే వాదనను బలంగా ప్రచారం చేయించారన్నారు. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు వారు ప్రభుత్వ ఇ-మెయిల్ ఖాతాకు బదులుగా మోరెన్స్ వ్యక్తిగత ఖాతాను ఉపయోగించి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్లు గుర్తించామన్నారు. దీంతో ఈ విషయంపై ఆంథోనీ ఫౌచీని కూడా విచారించే అవకాశం ఉంది. కరోనాపై ప్రమాదకర పరిశోధనల కోసం చైనాలోని వుహాన్ ప్రయోగశాలకు అమెరికా నుంచి నిధులు అందాయని, ఆ వైరస్ పుట్టుకపై వాస్తవాలను అగ్రరాజ్య ఉన్నతస్థాయి వ్యక్తులు తొక్కిపెట్టారని జూన్‌లో అమెరికా మాజీ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బార్డ్ వెల్లడించారు. ఈ మొత్తం కుట్ర వెనుక ఉన్న వ్యక్తి.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రధాన వైద్య సలహాదారుగా పనిచేసిన ఆంథోనీ ఫౌచీ అని పేర్కొన్నారు. త్వరలో ఫౌచీని కూడా విచారించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది. ఈ కేసు విచారణలో కోవిడ్ మూలాల రికార్డులు దాచేందుకు కుట్ర పన్నినట్టు డేవిడ్ మోరెన్స్ చెప్పడం వల్ల ఇప్పుడు అంతర్జాతీయస్థాయిలో దీనిపై చర్చకు ప్రాధాన్యత ఏర్పడింది. అమెరికా అసలు రంగు బయటపడుతున్నదని పలు దేశాల్లో ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

# లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు.
అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

**అమరావతి,ఆగస్టు 19 :**
వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటో జర్నలిస్ట్‌గా మారారు. ఫొటో జర్నలిస్ట్‌లు అందరిని కలిపి సీఎం గ్రూప్ ఫొటో తీశారు. కెమెరా తీసుకుని తానే ఫొటో తీస్తానని చెప్పారు. వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఫొటో జర్నలిస్ట్‌లు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేస్తూ.. జ్ఞాపకాలను పదిలపరుస్తున్న ఫొటోగ్రాఫర్లకు సీఎం అభినందనలు తెలిపారు. మానవ అనుభవాలను, అద్భుతమైన చిత్రాలుగా ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు చెప్పారు. మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల అంకితభావం, కళాత్మకత, నిరంతర కృషి అభినందనీయమని ప్రశంసించారు.

# సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, నిజామాబాద్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కామారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పీఏసీ సభ్యులు, డీసీసీ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం, ప్రజలతో మమేకమే లక్ష్యంగా ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.
క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

(మొదటి పేజీ తరువాయి)

లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయ పడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

- సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



**హైదరాబాద్,ఆగస్టు 19 :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
గురువారం, ఆగస్టు 20, 2026


# జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం



**ఖానాపూర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. 7వ తరగతి విద్యార్థులు గ్రామ పంచాయతీ పరిధిలోని హరితహారం నర్సరీ నుండి కానుగ, జామ, ఉసిరి, నేరేడు వంటి మొక్కలను తెచ్చి పాఠశాల ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని, పర్యావరణాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ వెన్నం అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్



**గంగాధర, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎన్నికల ముందు ప్రభుత్వం ప్రకటించిన విధంగా పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26,000 కేటాయించాలని, జీవో నెంబర్ 51ని రద్దు చేయాలని జాతీయ రైతు పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి. రెడ్డి కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గంగాధర మండల కేంద్రంలో జరిగిన దీక్షకు ఆయన సంఘీభావం తెలుపుతూ, కార్మికుల అకౌంట్లలో గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా వేతనాలు జమ చేయాలని, వయసు పైబడిన లేదా అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లు నమోదు చేసి, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# పార్టీ ప్రతిష్ఠ దెబ్బతీసే వారిపై చర్యలు తప్పవు భూక్యా జాన్సన్ నాయక్



**ఖానాపూర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీఆర్ఎస్ పార్టీ పేరుతో ప్రజలను మోసం చేయడం, అక్రమ వసూళ్లకు పాల్పడటం, పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించడం సహించేది లేదని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ హెచ్చరించారు. పార్టీకి సంబంధం లేని వ్యక్తులు తమను నాయకులుగా పరిచయం చేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇలాంటి నకిలీ నాయకత్వానికి చెక్ పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ ముసుగులో అక్రమాలకు పాల్పడితే కేవలం పార్టీ పరంగా కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోవర్టులు, మోసగాళ్లపై నిఘా ఉంచి వారి వివరాలను పరిశీలిస్తున్నామని, అవసరమైతే పేర్లను బహిర్గతం చేస్తామని జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. నిజమైన కార్యకర్తలకే ప్రాధాన్యం ఉంటుందని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలకు పాల్పడేవారిని మాత్రం ఉపేక్షించేది లేదని మరోసారి హెచ్చరించారు.

# రాత్రి వేళల్లో బస్ సర్వీసులు పెంచాలని ప్రజల డిమాండ్



**ఖానాపూర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండల కేంద్రానికి నిర్మల్ డిపో నుండి రాత్రి 8 నుంచి 11 గంటల మధ్య రెండు అదనపు బస్ సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి 15--30 నిమిషాలకు బస్సులు నడుస్తున్నప్పటికీ, రాత్రి సమయంలో సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల నుండి వచ్చే బస్సులు 10 గంటల లోపు చేరకపోతే ప్రయాణికులు నిర్మల్ బస్టాండ్‌లోనే రాత్రి గడపాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 11 గంటల వరకు బస్సులు పెంచితే దూరప్రాంత ప్రయాణికులకు సౌకర్యం కలుగుతుందని విశ్వహిందూ పరిషత్ సీనియర్ నాయకుడు జోగు రాజేశ్వర్ తెలిపారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు, మున్సిపాలిటీ, నాలుగు మండలాల ప్రజల కోసం రాత్రి బస్ సర్వీసులను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం





**హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ డివిజన్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. జై ఫోటోగ్రఫీ నినాదాలతో ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగి, అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య, అధ్యక్షుడు ముక్కెర రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి బైరగోని రాము, ఉపాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ యాదవ్, సహాయ కార్యదర్శి బోయిని సంపత్, ప్రచార కార్యదర్శి పచ్చిమట్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. సలహాదారులు జి.ఎస్.రావు, ఎలుగూరి మహేష్, గూళ్ల రవికుమార్, ముక్కెర రమేష్, 4వ వార్డు కౌన్సిలర్ పిల్లి తిరుపతి, కార్యవర్గ సభ్యులు కిరణ్, రాజు, రమేష్, సంతోష్, సోను, ప్రమోద్, రాకేష్ తదితరులు హాజరయ్యారు.

# రహదారి, గోదాముల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు



**సుల్తానాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధునాతన రహదారులు కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో రూ. 219.67 కోట్లతో హెచ్ఏఎం, నాన్‌ప్లాన్ రహదారి పనులు, రూ. 32 కోట్లతో గోదాముల నిర్మాణానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపనలు చేశారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో భారీగా రహదారి పనులు జరుగుతున్నాయని, రెండేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. పెద్దపల్లి బైపాస్ పనులు కొనసాగుతున్నాయని, సుల్తానాబాద్ బైపాస్‌ను గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలో చేర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ విజయరమణారావు ప్రజల కోసం నిజాయితీతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గత పదేళ్లలో రూ. 900 కోట్ల రహదారి పనులు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం రూ. 1,700 కోట్ల పనులు మంజూరు చేసిందని చెప్పారు. రైతులు, వ్యాపారులకు రహదారి అభివృద్ధి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ ఏడాదిలోపు పెద్దపల్లి బైపాస్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో గోదాముల సామర్థ్యం పెంపుతో పాటు కొత్త ఐబీ అతిథి గృహానికి రూ. 5 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠా కూర్, జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఓదెల సర్పంచ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ



**హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సైదాపూర్ మండలం వెన్నెంపల్లి గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన పల్లె దవాఖానను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. "పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామస్థుల వినతిపత్రాలను స్వీకరించి తక్షణ పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. గ్రామంలో ప్రతి నెల 363 మందికి రూ. 93.58 లక్షల మేర సంక్షేమ పథకాల లబ్ధి అందుతోందని తెలిపారు. 21 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతుండగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయని చెప్పారు. 35 మహిళా సంఘాలకు రూ. 13.50 లక్షల వడ్డీలేని రుణాలు, బ్యాంకు అనుసంధానం ద్వారా రూ. 4.35 కోట్ల రుణాలు అందించారని వివరించారు. రైతులకు రూ. 3.30 కోట్ల రైతు భరోసా, ఏడుగురికి రూ. 35 లక్షల బీమా పరిహారం, 250 మందికి రూ. 7.13 కోట్ల రుణమాఫీ, 213 మందికి రూ. 6.70 లక్షల సన్నవడ్ల బోనస్ అందిందని తెలిపారు. గ్రామంలో 101 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఆరుతడి పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. జలసిరి కార్యక్రమం ద్వారా నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా మార్చేందుకు ప్రజలు సహకరించాలని, కొత్త సామాజిక భద్రతా పెన్షన్లకు అర్హులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. బీసీ మహిళలకు సబ్సిడీ కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. "ప్రజల వద్దకే ప్రభుత్వం చేరి వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పల్లె పల్లెకు పొన్నం అన్న కార్యక్రమం కొనసాగుతుంది" అని మంత్రి పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై ప్రత్యేక దృష్టి కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గెజిటెడ్ అధికారి పరిశీలన ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయంలో ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి, గ్రామాల వారీగా లబ్ధిదారుల ఇళ్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లాగిన్‌లో నమోదు చేయాలని సూచించారు. అదే రోజు హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో త్వరలో జరగనున్న "పల్లె పల్లెకు పొన్నమన్న--పల్లె పల్లెలో ప్రజాపాలన" కార్యక్రమానికి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను నేరుగా కలుసుకుని సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలకు అవసరమైన టెంట్లు, కుర్చీలు, ధ్వని వ్యవస్థ ఏర్పాటు చేయాలని, దరఖాస్తులను నమోదు చేసి పరిష్కార స్థాయిని గుర్తించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, బీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, వడ్డీలేని రుణాలు వంటి పథకాల లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి గ్రామ సభల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి గడువులోపు పూర్తి చేయాలని, తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాల సమస్యలను ముందుగానే పరిష్కరించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల వివరాలు, పౌష్టికాహారంపై పూర్తి సమాచారం సిద్ధంగా ఉంచాలని, గ్రామ సభల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి పర్యవేక్షించాలని సూచించారు.

# జర్నలిస్టులకు ఉచిత ఇళ్లు, హెల్త్ కార్డులు కల్పిస్తాం బండి సంజయ్



**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "ఫోటో, వీడియోలు కేవలం క్షణాలను మాత్రమే బంధించవు, వాటి వెనుక ఉన్న చరిత్రను భద్రపరుస్తాయి. ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు వర్తమానానికి, గత చరిత్రకు నిజమైన సాక్షులు" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఫోటో, వీడియో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు నిజాన్ని చూపించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమని, కెమెరా ప్రభుత్వాల బాధ్యతను గుర్తుచేసే శక్తి కలిగివుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా యుగంలో మార్ఫింగ్‌లపై అప్రమత్తంగా ఉండి నిజాయితీతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, తక్కువ జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, హెల్త్ కార్డులు పనిచేయకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేసి, ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం, మీడియా యాజమాన్యాలను కోరారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు ఉచిత ఇళ్ల స్థలాలు, ఇళ్లు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందేలా హెల్త్ కార్డులు కల్పిస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొన్నారు.

# పల్లె బస్సు, రహదారి, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



**హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామానికి పల్లె బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థుల రవాణా, విద్యుత్, రహదారి, దేవాలయాలు, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోకిడి తిరుపతి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా విద్యార్థులు మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు రవాణా సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం, సాయంత్రం పాఠశాల సమయాలకు అనుగుణంగా గర్రెపల్లి మీదుగా పల్లె బస్సు నడపాలని కోరారు. గ్రామం మధ్యలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, గర్రెపల్లి--సైదాపూర్ రహదారిలో బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. హనుమాన్ దేవాలయం వద్ద వర్షాకాలంలో నీరు చేరకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని, పోచమ్మ గుడి స్థల సమస్యను పాత రికార్డుల ఆధారంగా పరిష్కరించాలని కోరారు. గర్రెపల్లి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడిన నేపథ్యంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని, గ్రామానికి తొలి పల్లె బస్సును మంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలు, విద్యార్థుల రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని దోకిడి తిరుపతి విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వం విద్యపై పెట్టే ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడిగా ఉంటుందని, అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. కోటపల్లి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో సి.ఎస్.ఆర్. నిధులతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 10వ తరగతి తర్వాత 2,500 మంది విద్యార్థులు చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు, నిష్ణాత ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన విద్యా హక్కును సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, విద్యా విధానం మెరుగుపరచడంలో కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రైవేట్ పాఠశాలల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని పేర్కొన్నారు. చెన్నూర్‌లో కాకా వెంకటస్వామి ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి వివేకానంద నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా శిక్షణ, విదేశీ ఉపాధి అవకాశాల కోసం జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మందమర్రిలో కూడా ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి ఎస్.ఐ., కానిస్టేబుల్ నియామకానికి అభ్యర్థులను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విస్తరణ పనులకు సి.ఎస్.ఆర్., సి.బి.ఎఫ్. నిధులు కేటాయించి కొత్త అంతస్తును ప్రారంభించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో కృషి చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమాల్లో పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ భవాని శివప్రసాద్



హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : చిగురుమామిడి మండల కేంద్ర సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, యువ నాయకుడు సాయి చరణ్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భవాని శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి దృష్ట్యా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. మంత్రి సహకారంతో మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సర్పంచ్ చేరికను స్వాగతిస్తూ, హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు చిగురు మామిడి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, మండలానికి మోడల్ స్కూల్ మంజూరు చేసినట్లు, కరీంనగర్--హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కుల కోసం బీజేపీ ముందువరుసలో నిలుస్తుందని, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేంత వరకు వారికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం రాజీపడవద్దని, నిజాయితీగా పోరాడే నేతలతోనే జేఏసీ కొనసాగాలని సూచించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం బీజేపీ నిరసన కార్యక్రమాలు చేపడుతోందని, కరీంనగర్‌లో 'ఫీజు పోరు' నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ డెయిరీని విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ, రైతాంగం క్షమించదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని డెయిరీని కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ముందు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పలువురు ఫోటోగ్రాఫర్లను బండి సంజయ్ ఘనంగా సత్కరించారు.

## అభివృద్ధిలో కరీంనగర్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం మంత్రి బండి సంజయ్



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అర్బన్ ఛాలెంజ్ ఫండ్ నిధులతో కరీంనగర్ నగరాన్ని మోడల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర ఉన్నతాధికారులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూసీఎఫ్ నిధులతో చేపట్టబోయే ప్రాజెక్టుల ప్రతిపాదనలను పరిశీలించి, వాటిని తక్షణమే కేంద్రానికి పంపాలని, సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. రూ.630 కోట్లతో 50 కిలోమీటర్ల మోడల్ రోడ్లు, మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, ఒక స్కైవాక్, ప్రధాన జంక్షన్ల అభివృద్ధి పనులు చేపడతారు. రూ.130 కోట్లతో 80 కిలోమీటర్ల వరద నీటి కాలువలు, రూ.80 కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు, 130 ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు వంటి కార్యక్రమాలు అమలు కానున్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కరీంనగర్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, తెలంగాణలో అభివృద్ధికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు.

## ఫీజు బకాయిల కోసం కలెక్టరేట్ ముట్టడికి బీజేవైఎం సన్నద్ధం



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం జరగనున్న "ఫీజుల బకాయి-- బిజెపి లడాయి" స్టూడెంట్ మార్చ్ ఏర్పాట్లను బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు పరిశీలించారు. గీతా భవన్ నుండి కలెక్టరేట్ వరకు సాగే ర్యాలీ మార్గం, కలెక్టరేట్ వద్ద బహిరంగ సభ వేదికను పరిశీలించి నాయకులకు సూచనలు చేశారు. ప్రవీణ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం బీజేవైఎం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తోందని, కరీంనగర్‌లో జరగనున్న ఈ నిరసన కార్యక్రమాన్ని విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

## సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు శంకుస్థాపన



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 39వ డివిజన్ పోచమ్మవాడలో ఉడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోచమ్మవాడలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు, పారిశుద్ధ్య పరంగా మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు మాసం గణేష్, తాటి ప్రభావతి, బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, దేవసాని సరస్వతి సత్యనారాయణ, గాజా రామ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కో-ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు





కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో వివిధ కార్యక్రమాలు జరిగాయి. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ఫోటోగ్రాఫర్లకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రఫీ మధుర జ్ఞాపకాలను పదిలపరిచే అద్భుత మాధ్యమమని, సమాజంలో జరిగే పరిణామాలను ప్రజలకు చేరవేయడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మారినా ఒక క్షణాన్ని శాశ్వత జ్ఞాపకంగా నిలిపే ఫోటోగ్రఫీ ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని పేర్కొన్నారు. అనంతరం సుకూర్, శైలేందర్ రెడ్డి, కిరణ్, జనార్దన్, మోసిన్, శ్రీధర్, రంజిత్ తదితర ఫోటోగ్రాఫర్లను సత్కరించారు. హుజురాబాద్‌లో కూడా అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఫోటోగ్రఫీ సంఘ అధ్యక్షుడు ప్రసాద్ పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, పాత్రికేయులు పాల్గొన్నారు. ఫోటోగ్రఫీకి వన్నె తెచ్చే ఫోటోగ్రాఫర్ల సేవలు సమాజానికి చిరస్థాయి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని ఈ వేడుకల్లో స్పష్టం చేశారు.

## తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఉద్యమానికి ఉద్యోగుల మద్దతు



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రాష్ట్ర ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రకటించిన ఉద్యమ కార్యాచరణకు కరీంనగర్ జిల్లా ఉద్యోగుల జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పిఆర్సి అమలు, పెండింగ్‌లో ఉన్న డిఎ విడుదల, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరణ, ఎంప్లాయిస్ హెల్త్ కార్డు లోపాల సవరణ వంటి డిమాండ్లతో దశల వారీగా ఉద్యమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 27న కలెక్టరేట్ ఎదుట ధర్నా, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం నిరసన, సెప్టెంబర్ 10న హైదరాబాద్ మహా ధర్నా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, భయం వీడి సంకల్పంతో ముందుకు రావాలని ఆయన ఉద్బోధించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలందిస్తూ తమకు రావాల్సిన హక్కులను మాత్రమే కోరుతున్నారని, జీతాలు, పెన్షన్ భద్రత, ఆరోగ్య భద్రత, భవిష్యత్తు కోసం దాచుకున్న నిధుల రక్షణ వంటి అంశాలు న్యాయమైన డిమాండ్లు అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు లేకుండా పాలన సాధ్యం కాదని, ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేయడంలో, విపత్కర పరిస్థితుల్లో అండగా నిలవడంలో వారి పాత్ర కీలకమని గుర్తు చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను తల్లి హృదయంతో అర్థం చేసుకుని పరిష్కరించాలని, ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి అండగా నిలిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని దారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. "మా లక్ష్యం ప్రభుత్వం ఆపడం కాదు, ప్రభుత్వాన్ని బలంగా నడిపించే ఉద్యోగులకు న్యాయం చేయించడం" అని ఆయన పిలుపునిచ్చారు.

## రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి చెయ్యాలి ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నగర అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు తీసుకెళ్లాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ కపుల్ దేశాయ్, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, విద్యుత్ సదుపాయాలు, లోతట్టు ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాకాలంలో జలమయం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. నగరంలో విలీనమైన గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. స్మార్ట్ సిటీ, యూడీఐఎఫ్, యూసీఎఫ్ నిధులను ప్రతి డివిజన్‌కు సమానంగా కేటాయించి సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు నలువాల రవీందర్, గుగ్గిల్లపు జయశ్రీ, సుధగోని మాధవి, జమ్ము, యూసుఫ్, అలీ, గడ్డి ప్రదీప్, మల్లేశం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్ల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఫారాల పంపిణీ, సేకరణ అనంతరం నోటీసులు జారీ చేసి, నిర్ణీత తేదీలో పౌరసత్వ ధ్రువపత్రాలు సమర్పించేలా చూడాలని సూచించారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి, అక్టోబర్ 15లోపు నోటీసుల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దశను సమన్వయంతో పర్యవేక్షిస్తూ పారదర్శకంగా, సమర్థవంతంగా ఎస్ఐఆర్‌ను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో 61,886 మంది ఓటర్లు మ్యాపింగ్ కాలేదని, 2,08,308 మంది ఓటర్లు అనామలీస్ కింద ఉన్నారని తెలిపారు. వీరందరికీ నిబంధనల ప్రకారం నోటీసులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానను సందర్శించిన మున్సిపల్ చైర్మన్



ఖానాపూర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ గురువారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను సందర్శించి పారిశుద్ధ్య సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి చుట్టుపక్కల పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ స్వర్ణ రెడ్డి, డాక్టర్ వంశీ మాధవ్, మున్సిపాలిటీ జవాన్ మనల శంకర్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు ప్రత్యేక సదస్సు



హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎల్‌నినో ప్రభావం కారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతు వేదిక హుస్నాబాద్‌లో ఆగస్టు 20 ఉదయం 9 గంటలకు జరిగే ఈ సమావేశంలో ఆయిల్ పామ్, కందులు, మినుములు, సజ్జ, రాగి, ఆముదం, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కూరగాయల సాగు యాజమాన్యం, నీటి సంరక్షణ పద్ధతులు, ఫామ్ పాండ్ నిర్మాణం, నీటి పొదుపు విధానాలపై చర్చించనున్నారు. "ఒక ఎకరం వరికి అవసరమైన నీటితో 3--9 ఎకరాల వరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయవచ్చు. నీటి వినియోగాన్ని తగ్గించి ఆరుతడి పంటలను ప్రోత్సహిద్దాం, అధిక ఆదాయం పొందుదాం" అని మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖతో పాటు గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, ఉపాధి హామీ శాఖ అధికారులు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేయనున్నారు.

## ఓపెన్ డ్రైనేజీతో వాహనదారులకు ముప్పు చర్యలు తీసుకోవాలని డిమాండ్



కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గణేష్ నగర్ మెయిన్ రోడ్ పక్కన ఉన్న ఓపెన్ డ్రైనేజీపై కాంక్రీట్ స్లాబ్ నిర్మించాలని కోరుతూ గణేష్ సేవ యూత్, బాల్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. 57వ డివిజన్ గణేష్ నగర్ కమాన్ నుండి బస్టాండ్‌కి వెళ్లే మార్గంలో డ్రైనేజీ ఓపెన్‌గా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాహనాలు వెళ్లేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. రహదారి గుంతలమయం కావడంతో సమస్యలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. డ్రైనేజీపై స్లాబ్ నిర్మించి, రహదారి మరమ్మతులు చేయడంతో పాటు వీధుల్లో కిందికి వంగిన విద్యుత్ వైర్లను సరిచేయాలని వారు వినతిపత్రంలో కోరారు.

## జానపద కళల అభివృద్ధికి ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి సుభాష్ చంద్రబోస్



హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : సకల కళల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 22న సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా స్థాయి కళాకారుల సదస్సు జరగనుంది. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ కళాకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర కన్వీనర్ వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. తెలంగాణ జాతీయ గీత రచయిత అందెశ్రీకి ఘన నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డికి సదస్సు ద్వారా కృతజ్ఞతలు తెలియజేయనున్నట్లు చెప్పారు. జిల్లా కళాకారులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని, కొత్త కమిటీని ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జానపద కళల పరిరక్షణ, అభివృద్ధి, కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక జానపద అకాడమీ, విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మంద మల్లేశం, సీనియర్ కళాకారులు వేముల వీరస్వామి నేత, తౌటు రామచంద్రం, చింతలపల్లి చిన్న తిరుపతిరెడ్డి, గౌరబోయిన కొమురెల్లి, చింతలపల్లి పెద్ద తిరుపతిరెడ్డి, జాగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు బీజేపీని తీసుకెళ్లాలి బైరి శంకర్ ముదిరాజ్



హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి గడపగడపకు బీజేపీని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత రేషన్, రైతు సంక్షేమ పథకాలు, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి శక్తి కేంద్రాలను క్రియాశీలం చేయాలని, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని ఆయన అన్నారు. మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లో కమిటీలను క్రియాశీలం చేసి గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. ప్రజా సమస్యలపై అవసరమైన సందర్భాల్లో నిరసనలు, ధర్నాలు చేపట్టి ప్రజల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, మండల పదాధికారులు, మోర్చా నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
గురువారం, ఆగస్టు 20, 2026


## రైల్వే స్టేషన్ వద్ద మురుగు కాలువలు వెంటనే శుభ్రం చేయాలి ఎంపీ వంశీకృష్ణ



**పెద్దపల్లి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి రైల్వే స్టేషన్ ముందు నెలకొన్న మురుగు కాలువలు, పారిశుద్ధ్య సమస్యపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రంగా స్పందించారు. కాలువలను వెంటనే శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశిం చారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఎంపీ తెలిపారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్ పరిసరాల్లో అపరిశుభ్రత ఉం డటం సరికాదని పేర్కొన్నారు. మురుగు నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధి కారులను ఆదేశిస్తూ, ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత అధికా రులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వంశీకృష్ణ తెలిపారు.

## అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడిని సన్మానించిన మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, ఆగస్టు 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్పెయిన్‌లో జూలై 2 నుండి ఆగస్టు 1 వరకు జరిగిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శనతో 175 ఫీడ్ రేటింగ్ పాయింట్లు సాధించిన కరీంనగర్ భగత్‌నగర్‌కు చెందిన శౌనక్‌ను కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన కార్యక్ర మ ంలో ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే సిఎం, ఎఫ్ఎం టైటిల్స్ సాధించి 2321 ఫీడ్ రేట ింగ్ సాధించడం కరీంనగర్‌కు గర్వకారణమని అన్నారు. శౌనక్ తల్లిదండ్రులు, కోచ్ రామ రా జు, అనూప్ కుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూ టీ మేయర్ సునీల్ రావు, శౌనక్ తల్లిదండ్రులు ప్రసాద్, అపూర్వ, జీనియస్ చెస్ అకాడమీ వ్యవ స్థాపకుడు కంకటి కనకయ్య, సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్స్ అకాడమీల అక్రమాలపై విచారణ జరిపించాలి యుఎస్ఎఫ్ఐ




**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న డిఫెన్స్ అకాడమీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ నగర కమిటీ డీఈవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది. నగర అధ్యక్షుడు మనితేజ మాట్లాడుతూ కొన్ని అకాడమీలు అనుమతి లేకుండా, మరికొన్ని ఒకే క్యాంపస్ అనుమతితో అనేక బ్రాంచ్‌లు నడుపుతున్నాయని, విద్యాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇంటర్ తరగతులను అకాడమీ పేరుతో నిర్వహిస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, యూనిఫాం, గ్రౌండ్, అదనపు ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా విద్యాధికారులు స్పందించి అకాడమీ యజమాన్యాలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ జరగకపోతే కలెక్టరేట్ కార్యాలయం ముందు జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## గోమాతకు జాతీయ మాత హోదా కోరుతూ భారీ తిరంగా ర్యాలీ




**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గోమాతను జాతీయ మాతగా గుర్తించాలని కోరుతూ నమో మిషన్ వందే గోమాతరం సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. తెలంగాణ చౌక్ వద్ద గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాజీ మంత్రి గంగుల కమలాకర్ సుమారు 200 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాతో ర్యాలీని ప్రారంభించారు. తెలంగాణ చౌక్ నుండి బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు, యువత, గోమాత ట్రస్ట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతిలో జాతీయ జెండాలు పట్టుకుని గోమాతను జాతీయ మాతగా గుర్తించాలని నినాదాలు చేస్తూ సాగిన ర్యాలీ నగర ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో నమో మిషన్ వందే గోమాత వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య మద్విరాజ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఫౌండేషన్ సభ్యులు జూపెల్లి ధీరజ్, కో–ఫౌండర్లు వేణు, దీపక్, అదిశేషు, నవీన్, మాజీ కార్పొరేటర్లు, విద్యార్థులు, గోమాత ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న హెడ్ కానిస్టేబుల్ అలీ



**హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ అలీ మానవత్వాన్ని చాటుకున్నారు. మల్లెచెట్టు చౌరస్తాలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా రోడ్డుపై పడిపోవడాన్ని గమనించిన ఆయన వెంటనే సహాయం అందించారు. అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, అది వచ్చే వరకు బాధితుడి వద్దే ఉండి సహాయం చేశారు. అనంతరం ఆసుపత్రికి తరలి ంచేలా చర్యలు తీసుకున్నారు. విధి నిర్వహణతో పాటు ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో సాయం చేసిన అలీని స్థానికులు అభినందించారు.

## హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద పెన్షనర్ల ధర్నా



**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కేంద్ర పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరిగిన ధర్నా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదుట అల్ ఇండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్లు నిరసన చేపట్టారు. పెన్షనర్లు మాట్లాడుతూ జనవరి 2020 నుండి జూన్ 2021 వరకు నిలిపివేసిన డిఎ వాయిదాలను ఇప్పటికీ చెల్లించలేదని, రాష్ట్ర పెన్షనర్ల కంటే తక్కువ పెన్షన్ అందుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 8వ కేంద్ర పే కమిషన్ రిపోర్టు ఇంకా వెలువడలేదని, అంతవరకు 50 శాతం ఇంటీరియం రిలీఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిజిహెచ్ఎస్ ఆరోగ్య కేంద్రాలు ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, రైల్వే వృద్ధులకు ఇచ్చిన టికెట్ రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. కరోనా సమయంలో నిలిపివేసిన డిఎ, డిఆర్ ద్వారా దాదాపు 40 వేల కోట్లను తిరిగి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల రామేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపాక చంద్రమోహన్ రావు, కోశాధికారి యేస్వాడ చంద్రమౌళి, రాజా ప్రభాకర్ పాల్గొన్నారు.

## కరువు నివారణ చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేపడతాం లిబరేషన్ పార్టీ



**నందికొట్కూరు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎల్‌నినో ప్రభావం, తీవ్ర వర్షాభావంతో పంటలు పూర్తిగా నష్టపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణ కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పంట పొలాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ పంటల కోసం అప్పులు చేసి సాగు చేసినా వర్షాభావంతో పంటలు ఎండిపోయాయని, పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో రైతులు ట్రాక్టర్లతో పంటలను దున్నివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతుకు ఎకరాకు రూ. 50,000 పరిహారం చెల్లించాలని, రూ. 2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని, రబీ సాగుకు విత్తనాలను 100 శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. కేసీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని కల్పించి, రోజువారీ వేతనాన్ని రూ. 700కు పెంచాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే మండల, నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బీబీ, రైతు సంఘం నాయకులు వడ్డే సుధాకర్, పిక్కిలి మాధవ నాయుడు, మేకల చంద్రశేఖర్, రైతు బాబు, మండ్లెం కొడితే వెంకటేశ్వర్లు, తెలుగు మద్దిలేటి, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన అడ్మిషన్లు



**పాములపాడు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పాములపాడులోని డి. నారాయణ రెడ్డి డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కరస్పాండెంట్ దుగ్గెంపూడి నారాయణ రెడ్డి తెలిపారు. బి.ఎ. హానర్స్ (హిస్టరీ), బి.ఎ. హానర్స్ (స్పెషల్ ఉర్దూ), బీకాం హానర్స్ (కంప్యూటర్ అప్లికేషన్), బి.ఎస్సీ హానర్స్ (బాటనీ), బి.ఎస్సీ హానర్స్ ఎమ్.ఎల్.టి (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ), బి.ఎస్సీ హానర్స్ (కంప్యూటర్ సైన్స్) కోర్సులకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కళాశాల రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ సంస్థ అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాములపాడులోని కే.జీ. రోడ్డులో ఉన్న కళాశాలకు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441000034, 9441 000035 నంబ ర్లను సంప్రదించవచ్చని సూచించారు.

## ముంపు బాధితుల దీక్షపై ప్రభుత్వం స్పందించాలి



**నందికొట్కూరు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీశైలం ముంపు బాధితులు ఐదు నెలలుగా నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులతో మాట్లాడుతూ బాధితులు, నాయకులు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఇప్పటివరకు 32 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, తమ కన్నీటి ప్రవాహం పాలకులను కదిలించలే కపోతుందని వేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీవో 98 ఉత్తర్వు అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆ తరువాత నీటి పంపకాలపై దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలతో కలిసి స్థానిక ఎన్నికల బహిష్కరణకు దిగుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో నాగసుంకన్న, నాగరాజు, నారాయణ, రామకృష్ణ, నాగేంద్రుడు, చిన్న సుబ్బయ్య, మౌలాలి, జయన్న తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన యాదవ కార్పొరేషన్ డైరెక్టర్



**నందికొట్కూరు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, కూటమి ప్రభుత్వానికి బీసీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 54 శాతం ఉన్న నేపథ్యంలో వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు బీసీల అభ్యున్నతికి ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తితో ప్రస్తుత ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించడం బీసీలకు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడమే కాకుండా, వారి అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంపత్ కుమార్ యాదవ్, కాగుల శంకర్, రామిరెడ్డి, మదిలేటి, ఎల్ల పుల్లయ్య, అయ్యన్న, వడ్డే జములయ్య, డి. రఫీ, డి. బుజ్జి, డి. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైశ్య భవన్ పునర్నిర్మాణ భూమిపూజ కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్‌లో ఉన్న వైశ్య భవన్‌ను అత్యాధునిక హంగులతో నూతన కన్వెన్షన్ హాల్‌గా పునర్నిర్మించేందుకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైశ్యసేవ కేంద్రం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు అతిథులకు ఘన స్వాగతం పలికి, శాలువాలు కప్పి సత్కరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. అనంతరం నిర్మాణానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఆర్యవై శ్యుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు మాత్రమే కాకుండా ప్రజలందరికీ వేదికగా నిలిచే ఈ భవనాన్ని ఆధునిక వసతులతో తీర్చిదిద్దడం అభినందనీయమని, నిర్మాణ పనులకు తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైశ్యసేవ కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్, కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి రమేష్‌తో పాటు పలువురు ప్రముఖ ఆర్యవైశ్యులు, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా స్థాయి యోగా పోటీలు



**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగ విన్యాసాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బాల్యం నుండే యోగాలో శిక్షణ పొందితే శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని, కరీంనగర్ నుండి అధిక సంఖ్యలో క్రీడాకారులు జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. యోగాను ప్రతి ఇంటిలో తప్పనిసరి చేయాలని, రానున్న రోజుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎన్. రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా యోగాలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని, ఇక్కడి నుండి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఉన్నారని గుర్తుచేశారు. చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జిల్లా రాష్ట్రస్థాయిలో ఛాంపియన్గా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి ఖేలో ఇండియా జాతీయ యోగా పోటీలను కరీంనగర్‌లో నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మాజీ చైర్మన్ పొన్నం అనిల్, మాజీ కార్పొరేటర్లు చల్లా హరిశంకర్, ఎడ్ల అశోక్, మైఖేల్ శ్రీనివాస్, జిల్లా యోగా అసోసియేషన్ నాయకులు, కోచులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై బీఆర్ఎస్ సమీక్ష సమావేశం



**హుస్నాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా హుస్నాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను ఏజెంట్లకు అందజేశారు. ప్రతి బూత్ పరిధిలోని జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఉండేలా చూడాలని సూచించారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, ఒకే వ్యక్తి పేరు రెండుచోట్ల నమోదైన సందర్భాలు, పేర్లు--చిరునామాల్లో తప్పులు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించాలని తెలిపారు. ఆగస్టు 18 నుంచి 25 వరకు అభ్యంతరాలు, సవరణలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం--6, పేరు తొలగింపునకు ఫారం--7, వివరాల సవరణకు ఫారం--8 దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షించేలా పనిచేయాలని సూచించారు. తప్పులు లేని సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వినతి



**సుల్తానాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ పాఠశాలలకు కేటాయిస్తున్న క్రీడా నిధులు సరిపోవడం లేదని పెద్దపల్లి జిల్లా క్రీడా సంఘం అధ్యక్షుడు వేల్పుల సురేందర్, ప్రధాన కార్యదర్శి రమేష్ తెలిపారు. ప్రస్తుతం కేటాయిస్తున్న రూ. 25 వేల నిధులను పెంచాలని వారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు వినతిపత్రం అందజేశారు. క్రీడా సామగ్రి కొనుగోలు, విద్యార్థుల ప్రయాణ ఖర్చులు, ఆహారం, క్రీడా దుస్తులు వంటి అవసరాలకు ప్రస్తుత నిధులు తగడం లేదని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ప్రత్యేక క్రీడా బడ్జెట్ కేటాయించాలని, మౌలిక వసతులు, సామగ్రి, శిక్షణతో పాటు నిధులను పెంచాల్సిన అవసరం ఉందని వారు సూచించారు.

# నాలుగు నెలల బాబును దత్తత తీసుకున్న కర్ణాటక దంపతులు



**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కర్ణాటకకు చెందిన దంపతులకు కరీంనగర్ శిశుగృహలోని నాలుగు నెలల బాబును జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి దత్తత అందించారు. ఈ సందర్భంగా పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన విధానంలోనే దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. పూర్తి సమాచారం కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, జిల్లా పరిషత్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డిసిపిఓ పర్వీన్, శిశుగృహ ఇంచార్జి అపూర్వ, జె. తిరుపతి, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, మునిగంటి రాజ్‌కుమార్, సాదినేని రమేష్, అనూష, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**ఓదెల, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఓదెల మండలం పోత్కాపల్లి గ్రామంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను శ్రీ మల్లికార్జున ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్ల జెండాను ఆవిష్కరించి, అనంతరం ఫోటోగ్రఫీ పితామహుడికి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఫోటోగ్రఫీ ప్రాధాన్యతను, సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్రను గుర్తుచేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఓదెల మండలంలోని ఫోటో, వీడియో గ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు నివారణకై ఫాగింగ్ కార్యక్రమం నిర్వహణ



**ఖానాపూర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు నివారించేందుకు ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీ 9వ వార్డులో మున్సిపాలిటీ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ మాట్లాడుతూ పట్టణంలోని 12 వార్డులలో రోజువారీగా ఫాగింగ్ కార్యక్రమం చేపడుతున్నామని, ఇప్పటివరకు 9 వార్డులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన వార్డుల్లో కూడా త్వరలో స్ప్రే పూర్తి చేస్తామని చెప్పారు. ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్‌పై ఆరోపణలు అవాస్తవం రాసమల్ల అశోక్



**ఖానాపూర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా అమలు చేస్తోందని నిర్మల్ జిల్లా డీసీసీ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి రాసమల్ల అశోక్ తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 కింద రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాల పరిధిలోనే ఈ పథకాలు అమలవుతున్నాయని, సుప్రీంకోర్టు తీర్పులు కూడా దీనికి న్యాయ ఆధారమని ఆయన గుర్తుచేశారు. ప్రజాధనంపై పూర్తి నియంత్రణతో, బడ్జెట్ ఆమోదం మేరకు నిధులు విడుదలవుతున్నాయని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో కఠినమైన వెరిఫికేషన్ విధానం అమలులో ఉందని, వధువుకు 18 సంవత్సరాలు పూర్తి కావడం తప్పనిసరి అని, ఆర్డీఓ, తహసీల్దార్ పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మాత్రమే సాయం అందజేస్తున్నామని వివరించారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని రాసమల్ల అశోక్ అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన కొనసాగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మహిళలకు అండగా షీ టీం సేవలు




**అమరాబాద్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఎదుర్కొనే అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు షీ టీం అండగా ఉంటుందని అచ్చంపేట డిఎస్పి పల్లె శ్రీనివాస్ తెలిపారు. ఐనేలు గిరిజన బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో జిల్లా షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, షీ టీం తక్షణమే స్పం దించి బాధితులకు అండగా నిలుస్తుందని చెప్పారు. బాలికలు చదువుపై శ్రద్ధ పెట్టాలని, సోషల్ మీడియాలో అసభ్యకర లింకులు, అనవసర విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమ రవాణా వంటి చర్యలకు చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కార్యక్రమంలో షీ టీం జిల్లా ఇన్చార్జి విజయలక్ష్మి, అచ్చంపేట సీఐ నాగరాజు, ఎస్సై అంజ య్య, సభ్యులు వెంకటయ్య, మల్లేష్, వెంకట్ నాయక్, జానకి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి ఏఎస్పీ సుస్మిత




**నంద్యాల, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తి యాప్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ సుస్మిత ఐపీఎస్ విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, మత్తుపదార్థాల నివారణపై సూచనలు చేశారు. శక్తి యాప్ ద్వారా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 100,112కు ఫోన్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు ఆలస్యం చేయకుండా 1930కు సమాచారం ఇవ్వాలని, బాల్యవివాహాలపై సమాచారం ఉంటే 1098కు ఫోన్ చేయాలని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని, చెడు అలవాట్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు తెలిసినట్లయితే 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మహిళల భద్రత, రక్షణ పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఏఎస్పీ సుస్మిత స్పష్టం చేశారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్సై నాగేంద్ర ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలి




**నంద్యాల, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు. జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల పరిస్థితులు, మౌలిక వసతుల అవసరాలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్ల జాబితాల తయారీ, ఎన్నికల సామగ్రి సమీకరణ, శాంతిభద్రతల ఏర్పాట్లపై చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో 12 జెడ్పీటీసీ స్థానాలు, 7 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ప్రక్రియ దాదాపు పూర్తయిందని, సెప్టెంబర్ 3న పట్టణ స్థానిక సంస్థల సమగ్ర ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అదనపు బ్యాలెట్ బాక్సుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను సమీక్షించారు.

# వైభవంగా నూతన వైశ్య భవన్ ఏసీ కన్వెన్షన్‌కు భూమిపూజ

**– వైశ్యుల ఐక్యత, సేవా స్ఫూర్తి అభినందనీయం: బండి సంజయ్**

**– భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నిర్మాణం: గంగుల కమలాకర్**





**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలో త్వరలో నిర్మాణం చేపట్టనున్న నూతన వైశ్య భవన్ ఏసీ కన్వెన్షన్‌కు బుధవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్ అధ్యక్షతన పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నగర వైదిక పౌరోహితులు మంగళంపల్లి శ్రీనివాస శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ అత్యంత వైభవంగా సాగింది. ముఖ్య అతిథులుగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై నూతన నిర్మాణానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ సామాజిక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వైశ్యులు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. వైశ్యులంతా ఐకమత్యంతో ముందుకు వచ్చి నూతన వైశ్య భవన్ నిర్మాణానికి దాతలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. సమాజ అభివృద్ధికి వైశ్యులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. నూతన భవన్ నిర్మాణానికి తనవంతు సంపూర్ణ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్‌లోని వైశ్య భవన్ ఎన్నో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు, వేలాది వివాహ వేడుకలకు వేదికగా నిలిచిందన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నూతన భవన్ నిర్మాణానికి సంకల్పించడం అభినందనీయమన్నారు. నూతన వైశ్య భవన్ ఏసీ కన్వెన్షన్ నిర్మాణానికి తనవంతు సంపూర్ణ సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని తెలిపారు. వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్ మాట్లాడుతూ నూతన భవన్ నిర్మాణానికి దాతలుగా ముందుకొచ్చి సహాయ సహకారాలు అందిస్తున్న వైశ్య సోదరులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో భవన్ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి సమాజానికి మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొని నూతన భవన్ నిర్మాణానికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్పొరేటర్లు వంగల పవన్, బోనగిరి వేణుగోపాల్, కక్కిరాల రమేష్, కోడిత్యాల మల్లేశం, పెద్ది లక్ష్మీనారాయణ, గంజి స్వరాజ్యబాబు, నలుమాసు సుదర్శనం, కమటాల రామ్మోహన్, వైశ్య సేవా కేంద్రం ప్రధాన కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, కోశాధికారి ముత్యాల రమేష్, వైశ్య భవన్ ఏసీ కన్వెన్షన్ నిర్మాణ కోఆర్డినేటర్ పల్లెర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎలగందుల మునీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామిడి శ్రీధర్, డైరెక్టర్లు సిరిపురం సురేందర్, నార్ల శ్రీనివాస్, నలుమాచు చంద్రశేఖర్, కైలాస నవీన్, కొండ రాంబాబు, గౌరీశెట్టి సుమన్, పోకల లక్ష్మీనారాయణ, మాడూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు. వివిధ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, దాతలు, వైశ్య సోదరులు అధిక సంఖ్యలో హాజరై నూతన వైశ్య భవన్ ఏసీ కన్వెన్షన్ భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ‘బాబు’ అనే ఒక్క మాటతో వీడిన రూపారెడ్డి హత్య మిస్టరీ

**– ప్రిన్సిపల్‌ను హత్య చేసింది పదో తరగతి విద్యార్థులే.. ఇద్దరు అదుపులో**

**– రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్, కత్తి, సెల్‌ఫోన్లు స్వాధీనం**




**దేవరకొండ, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో సంచలనం సృష్టించిన నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసు మిస్టరీ వీడింది. ప్రిన్సిపల్‌ను అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. గతంలో ప్రిన్సిపల్ మందలించడంతో కక్ష పెంచుకున్న విద్యార్థులు.. ఆమె వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందన్న ఉద్దేశంతో పక్కా ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ■ దర్యాప్తును మలుపుతిప్పిన ‘బాబు’

ఆగస్టు 11న రూపారెడ్డి హత్యకు గురయ్యారు. అంతకుముందు ఆమె తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతుండగా చివరిగా ‘బాబు’ అని పలికారు. ఆ వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ‘బాబు’ అంటూ ఆమె ఎవరిని ఉద్దేశించి మాట్లాడారన్న అంశం పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారింది. పాఠశాలలో రూపారెడ్డి విద్యార్థులను సాధారణంగా ‘బాబు’ అని పిలిచేవారని పోలీసులు గుర్తించారు. దీంతో దర్యాప్తు విద్యార్థుల వైపు మళ్లింది. ప్రిన్సిపల్ మృతికి సంతాప సూచకంగా పాఠశాలకు వరుసగా ఆరు రోజులపాటు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులను విచారించడంలో కొంత జాప్యం జరిగింది. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత పోలీసులు విద్యార్థులను ఒక్కొక్కరినీ విచారించారు. వరుసగా రెండు రోజులపాటు పాఠశాలకు హాజరుకాని కొందరు విద్యార్థుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు. వారిలో జల్సాలకు అలవాటు పడిన ఐదుగురు విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

## ■ 30 కిలోమీటర్ల పరిధిలో జల్లెడ

కేసును జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సవాలుగా తీసుకుని దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నేరస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ఫోరెన్సిక్ ఆధారాలు, వేలిముద్రలు, డాగ్‌స్క్వాడ్, సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలు తదితర అంశాలపై దర్యాప్తు చేపట్టారు. హత్య జరిగిన ప్రాంతంతోపాటు పరిసరాల్లో సుమారు 30 కిలోమీటర్ల పరిధిని 360 డిగ్రీల కోణంలో పరిశీలించారు. దాదాపు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను రాత్రింబవళ్లు విశ్లేషించారు. సాంకేతిక, సమాచార విభాగాలతో సమన్వయంతో పనిచేసిన ఐదు ప్రత్యేక బృందాల్లో సుమారు 40 మంది అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమించారు. 80 మందికిపైగా అనుమానితులను విచారించారు. ఈ క్రమంలో నేరస్థలానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలు అనుమానిత విద్యార్థుల కదలికలతో సరిపోలడంతో పోలీసుల అనుమానం మరింత బలపడింది. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో పెండ్లిపాకల ‘ఎక్స్’ రోడ్డు నుంచి మల్లేపల్లి వైపు బైక్‌పై వస్తున్న ఇద్దరు పదో తరగతి విద్యార్థులను దొనియాల ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి తనిఖీ చేయగా లోదుస్తుల్లో నగదు దాచినట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.1.54 లక్షల నగదు లభించింది. అందులో మూడు రూ.500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించగా.. ప్రిన్సిపల్ రూపారెడ్డిని హత్య చేసి ఆమె వద్ద ఉన్న నగదును అపహరించినట్లు విద్యార్థులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

## ■ మందలింపుతో కక్ష.. డబ్బు కోసం పథకం

నిందితులిద్దరూ నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతూ హాస్టల్‌లో ఒకే గదిలో ఉంటున్నారు. జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడిన వారు తల్లిదండ్రులకు తెలియకుండా సెల్‌ఫోన్లు వినియోగిస్తూ సోషల్ మీడియా, యూట్యూబ్‌లో సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించినట్లు పోలీసులు తెలిపారు. గత నెలలో హాస్టల్‌లో డబ్బుతో పట్టుబడిన ఇద్దరినీ ప్రిన్సిపల్ రూపారెడ్డి వారి తల్లిదండ్రుల సమక్షంలో మందలించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న విద్యార్థులు ఆమెపై కక్ష పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. రూపారెడ్డి వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించి.. సోషల్ మీడియాలో హత్యకు సంబంధించిన వివరాలను అన్వేషిస్తూ, ఆధారాలు దొరకకుండా హత్య చేయడానికి పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు.

## ■ వారం రోజులుగా రెక్కీ

హత్యకు ముందు వారం రోజులపాటు రూపారెడ్డి కదలికలను విద్యార్థులు గమనించినట్లు పోలీసులు తెలిపారు. పథకంలో భాగంగా మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి బ్యాగులో ఎరుపు రంగు హుడీ, ప్యాంట్ తీసుకుని వచ్చారు. అనంతరం కొండమల్లేపల్లిలో కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు. రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకున్న ఇద్దరిలో ఒకరు బయట ఎవరైనా వస్తున్నారా అని గమనిస్తుండగా.. మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించాడు. అప్పటికే తెరిచి ఉన్న వంటగది మార్గం ద్వారా ఇంట్లోకి వెళ్లి రూపారెడ్డిపై కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్య అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న సుమారు రూ.2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి పరారయ్యారు. హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేశారు. కొంతదూరం వెళ్లిన తర్వాత దుస్తులు మార్చుకుని ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో వెల్లడైంది.

## ■ ప్రత్యేక బృందాలకు ఎస్పీ అభినందనలు

కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు, మల్లేపల్లి సీఐ ఏ. నవీన్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్‌రెడ్డి, మల్లేపల్లి ఎస్ఐ అజ్మీర రమేష్, చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ డి. నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ ఎన్. వెంకన్న, సీసీఎస్ ఎస్ఐ యు. సురేష్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

కేసులో ప్రతి చిన్న ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసు బృందాల కృషి అభినందనీయమని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నేరస్థులు ఎంత తెలివిగా వ్యవహరించినా శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయంతో దర్యాప్తు చేస్తే నేరాన్ని ఛేదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# ఫోటోగ్రఫీతో మధుర జ్ఞాపకాలకు శాశ్వత రూపం

**– ఆమనగల్లులో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు.. లూయిస్ దాగురెకు ఫోటోగ్రాఫర్ల ఘన నివాళి**



**ఆమనగల్లు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ రూపొందించిన పతాకాన్ని ఆవిష్కరించి ఎగురవేశారు. అనంతరం కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. మండల అసోసియేషన్ అధ్యక్షుడు కాడిగె సత్యం మాట్లాడుతూ.. ఫోటో అనేది మధుర జ్ఞాపకాలను పదిలపంచడంతో పాటు చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే విలువైన ఆధారమని అన్నారు. ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఫోటోగ్రాఫర్లకు సూచించారు. ఫోటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ తరఫున కృషి చేస్తామని తెలిపారు. ఫోటోగ్రఫీ వృత్తిలో ఉన్నవారంతా ఐకమత్యంతో ముందుకు సాగి రంగానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ పాషా, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జావీద్, కోశాధికారి ఎం.వెంకటేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు శ్రీశైలం యాదవ్, అలీమ్, వెంకటేష్, బిక్కు, రఫీ, నాజర్, గణేష్, జబ్బార్, కాలె శివ, ఎం.మహేష్, పి.శేఖర్, కలీం, శ్రీకాంత్, ఫారిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఏర్పాటు

**– నేడు లక్ష్మీ నరసింహ ఫంక్షన్‌హాల్‌లో కమిటీల నిర్మాణం.. పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నాయకుల పిలుపు**



**ఆమనగల్లు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జాతీయ కమిటీలు రద్దైన నేపథ్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఆమనగల్లు మండలంలో నూతన కమిటీల నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు షాద్‌నగర్ రోడ్డులోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీతో పాటు ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్, అనుబంధ సంఘాల నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, మాదిగ కుల పెద్దలు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. సామాజిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు చురుకుగా పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి తుడుం కిరణ్ మాదిగ, సీనియర్ నాయకులు మల్లెపోగు మల్లేష్ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం మాదిగ, పులి కంటి మైసయ్య మాదిగ, అల్లాజీ మాదిగ, జానయ్య మాదిగ, శ్రీరామ్ మాదిగ, రమేష్ మాదిగ, శ్రీశైలం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో రమణికి సీఎంఆర్ఎఫ్ చెక్కు

**– చీపునుంతలలో లబ్ధిదారురాలికి ఆర్థిక భరోసా..**
**– ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**



**ఆమనగల్లు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తలకొండపల్లి మండలంలోని చీపునుంతల గ్రామానికి చెందిన మేడమోని రమణికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కును బుధవారం గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ అందజేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఈ ఆర్థికసాయం మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మమ్మ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి రఘుపతి, మాజీ ఉపసర్పంచ్ చెన్నకేశవులు, వార్డు సభ్యులు వంకూరి శ్రీరామ్, శారద, నాయకులు శ్యామ్లాల్, వెంకటయ్య, పెంటయ్య, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి పనులపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**– సీతారాంనగర్ తండా, శెట్టిపల్లిలో ఫారం పాండ్ పనుల తనిఖీ..**
**– రైతులకు నీటి సంరక్షణపై అవగాహన**



**ఆమనగల్లు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జలసిరి కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు మండలంలోని సీతారాంనగర్ తండా, శెట్టిపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఫారం పాండ్ పనులను బుధవారం గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యత, నిర్వహణ తీరును పరిశీలించి సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు, కూలీలతో మాట్లాడి ఫారం పాండ్‌ల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భజలాల మట్టం పెంచుకోవచ్చని, పంటలకు అవసరమైన నీటి లభ్యత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) ద్వారా అర్హులైన రైతులు ఫారం పాండ్‌ల నిర్మాణం చేపట్టాలని అవగాహన కల్పించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలను మరింత విస్తృతం చేసి, భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జలసిరి ప్రత్యేక అధికారి నీరజ, డీఆర్‌డీఏ అధికారి సుభాషిణి, ఏపీడీ ఇబ్రహీంపట్నం శేషుకుమార్, ఎంపీడీఓ జైరాం విజయ్, సర్పంచులు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# సన్న వడ్ల సాగుకు సర్కారు ప్రోత్సాహం

**– ఏడు రకాల వరికి ఎకరాకు రూ.500 బోనస్.. సెప్టెంబర్ 10లోగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి**



**ఆమనగల్లు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖరీఫ్–2026లో ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరిని సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు రూ.500 బోనస్ అందించనున్నట్లు ఆమనగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) శోభారాణి తెలిపారు. బోనస్ పొందేందుకు రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం సూచించిన రకాలైన బీపీటీ–5204 (సాంబ మసూరి), హెచ్ఎంటీ సోనా, ఆర్ఎన్ఆర్–15048 (తెలంగాణ సోనా), జైశ్రీరామ్, కేఎన్ఎం–1638, కేఎన్ఎం–7715, డబ్ల్యూజీఎల్–44 (వరంగల్ సన్నాలు)లో వరిని సాగు చేస్తున్న రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. డీలర్ వద్ద విత్తనం కొనుగోలు చేసిన రైతులు అదే డీలర్ వద్ద, ఇతర వనరుల నుంచి విత్తనం పొందిన రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 10, 2026లోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, గడువు తర్వాత ఎలాంటి రిజిస్ట్రేషన్ స్వీకరించబడదని స్పష్టం చేశారు. నిర్దేశిత విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే ఎకరాకు రూ.500 బోనస్ మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన రైతులందరూ గడువులోగా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ శోభారాణి కోరారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి:సిహెచ్ లక్ష్మీనారాయణ



**నల్లగొండ,ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నల్లగొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద కార్మికుల తో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీ ఓ ఇస్మాయిల్ కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని అన్నారు కార్మికుల ప్రాణాలను హరిస్తున్న జీవో నెంబర్ 51 ని సరిచేసి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని ప్రతి కార్మికుడికి పోస్టల్ ఇన్సూరెన్స్ గ్రామపంచాయతీ నుండి చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు మరణించినట్లయితే మట్టి ఖర్చులకు 30 వేల రూపాయలు గ్రామపంచాయతీ నుండి ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు ప్రకటించిన విధంగా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్యదర్శులు సర్పంచ్ల వేధింపులు అధికమవుతున్నాయని అన్నారు వెంటనే కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు అర్హత కలిగిన బిల్ కలెక్టర్ కారోబార్ లను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని కార్మికులకు రావాల్సిన సబ్బులు బట్టలు నూనె చెప్పులు తదితర వస్తువులను వెంటనే ఇప్పించాలని అన్నారు ఇటీవల కాలంలో కార్మికులపై పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ల వేధింపులు అధికమవుతున్నాయని కార్మికులపై కక్ష సాధింపు చేయకూడదని హితవు పలికారు కార్మికులకు కనీస వేతనం 26,000 నిర్ణయించాలని రెండవ పిఆర్సి లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 24 25 తేదీలలో కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అప్పటికి సమస్య పరిష్కరించకపోతే చలో హైదరాబాద్ నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు వడ్డేపల్లి యాదయ్య, దున్న, అనిల్ కుమార్, ఇరిగి ఎల్లేష్ సింగపంగా లింగమ్మ ,ఏనుగు వాణి ,శంకర్ ,ముత్తయ్య, భద్రయ్య ,లింగయ్య ,రాంబాబు, మల్లేష్ ,సైదమ్మ ,రేణుక ,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్పీజీ సిలిండర్ ఈ-కేవైసీ గడువు పొడిగింపు



**గడివేముల, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గడివేముల మండల పరిధిలోని ఎల్పీజీ వినియోగదారులకు కీలక సమాచారం. ఈ–కేవైసీ గడువు ఆగస్టు 16న ముగియగా ఆయిల్ కంపెనీలు మరోసారి పొడిగించి ఆగస్టు 23 వరకు పూర్తి చేసుకోవాలని సూచించాయి.అయితే సర్వర్ సమస్యల కారణంగా ఆన్‌లైన్‌లో కేవైసీ ప్రక్రియ పూర్తికావడం లేదని గ్యాస్ డీలర్లు తెలిపారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించకపోతే గడువు పొడిగింపుతో ప్రయోజనం ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకం



**నంద్యాల, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా పర్యాటకశాఖ అధికారి డాక్టర్ ఏ. సునీల్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టాక్సీ, బస్సు, ఆటో డ్రైవర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాత్రికులు, పర్యాటకులతో ఎలా ప్రవర్తించాలి, వారి అవసరాలను ఎలా తీర్చాలి అనే అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు.పర్యాటక శాఖ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి. జస్వంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో సేవలందించే డ్రైవర్లకు ఈ శిక్షణ ముఖ్యమని తెలిపారు.తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, హోటల్ మేనేజ్మెంట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి. తిమ్మప్ప, భార్గవి, శివరామకృష్ణ డ్రైవర్లకు ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి, పర్యాటకులతో ఎలా ప్రవర్తించాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం వేడుకలు



**నందికొట్కూరు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నందికొట్కూరులో ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఫోటో స్టూడియో యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, బాలరాజు నేతృత్వంలో వైస్ ప్రెసిడెంట్ శేషు కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన బస్టాండ్ నుంచి షాపూర్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ప్రతి శుభకార్యం, సామాజిక కార్యక్రమం, ముఖ్య సంఘటనలను కెమెరాలో బంధించి చిరస్మరణీయంగా నిలిపే ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమని అన్నారు. ఫోటోగ్రఫీ ఒక కళ మాత్రమే కాకుండా చరిత్రను భద్రపరిచే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలందించిన మహనీయులను స్మరించుకుంటూ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1839లో ఫ్రెంచ్ ప్రభుత్వం డాగ్యురోటైప్ ఫోటోగ్రఫీ ప్రక్రియను ప్రపంచానికి పరిచయం చేసిన సందర్భంగా ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి.

## ఆరుతడి పంటలకు కేసీ కెనాల్ నీరు అందించాలి




**పాములపాడు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రైతులు వేసుకున్న ఆరుతడి పంటలకు కేసీ కెనాల్ ద్వారా నీరు విడుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి డి. స్వామన్న, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి. వెంకటేశ్వ రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరులతో మాట్లాడుతూ వారు, జూన్‌లో తొలకరి వర్షాలకు పంటలు వేసుకున్న రైతులు వర్షాభా వంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం మద్దతు ధర లేక నష్టపోయిన రైతులు ఈ ఖరీఫ్‌లో కూడా పంటలు దున్నివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.కేసీ కెనాల్ నీటిని త్రాగునీటి కోసం వదిలారని అధికారులు చెబుతున్నా, రైతుల పరిస్థితి దారుణంగా ఉందని వారు ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.కెనాల్ కింద ఉన్న పొలాలకు ఆరుతడి పంటలకు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు కూడా జోక్యం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్. బాలయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాండ్ల హనుమాన్ దేవాలయంలో శ్రమదానం



**యాచారం, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**యాచారం మండలం నక్కర్త మేడిపల్లి గ్రామ పరిధిలోని పురాతన పెరుమాండ్ల హనుమాన్ దేవాలయం వద్ద బుధవారం శ్రమదానం జరిగింది.పీఆర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త, గ్రామస్తుడు నారియా నాయక్ (బాపూజీ)తో పాటు స్థానికులు కలిసి దేవాలయం ప్రాంగణంలో పనికిరాని చెట్లను తొలగించి మట్టి పోశారు.ఈ సందర్భంగా రవీందర్ గుప్త మాట్లాడుతూ, “పెరుమాండ్ల ఆంజనేయ స్వామి ఆలయాన్ని ప్రజాప్రతినిధుల సహకారంతో పునర్నిర్మాణం చేస్తాం”
అని తెలిపారు.

## మల్టీ పర్పస్ విధానం రద్దుకు సిఐటియు డిమాండ్



**గుడిపల్లి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ నియోజకవర్గం గుడిపల్లి మండల కేంద్రంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ పెరిక విజయ్ మాట్లాడుతూ, "గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పంచాయతీ కార్మికులకు పర్మనెంట్ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలు అమలు కావాలి" అని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బుర్రి కొండలు, కొమ్ము దుర్గయ్య, పూల వెంకటయ్య, లక్ష్మయ్య, రామస్వామి, శ్రీను, ఈశ్వర్, యాదయ్య, అంజయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌పీజీ సిలిండర్ డెలివరీపై ప్రభుత్వ నిబంధనలు పాటించాలి కొర్ర కిషన్ నాయక్



డా., కొర్ర. కిషన్ నాయక్
RTIAS రాష్ట్ర అధ్యక్షులు
ఫోన్ నెం 9885122005

**దేవరకొండ, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం మరియు చమురు సంస్థలు (ఐఓసిఎల్, బిపిసిఎల్, హెచ్పిసిఎల్) స్పష్టంగా పేర్కొన్న నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ నుండి 15 కిలోమీటర్ల పరిధిలో ఎల్‌పీజీ సిలిండర్‌ను వినియోగదారుల ఇళ్లకు అదనపు రుసుము లేకుండా డెలివరీ చేయాలి. అధికారిక బిల్లులోనే డెలివరీ ఛార్జీలు కలిపి ఉంటాయి. డెలివరీ బాయ్ ఎలాంటి అదనపు రుసుము లేదా టిప్స్ బలవంతంగా వసూలు చేయడం చట్టవిరుద్ధమని ఆర్టిఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర కిషన్ నాయక్ స్పష్టం చేశారు. 15 కిలోమీటర్ల పరిధిని మించి ఉన్న ప్రాంతాలకు మాత్రమే చమురు కంపెనీలు నిర్ణయించిన అదనపు రవాణా ఛార్జీలు వర్తిస్తాయి. వినియోగదారుడు స్వయంగా గోడౌన్ వద్ద సిలిండర్ తీసుకుంటే బిల్లులో చేర్చిన డెలివరీ ఛార్జీలు (రూ. 27--30 వరకు) ఏజెన్సీ తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. సిలిండర్ అందించే సమయంలో బరువును తనిఖీ చేసి, సీల్ సరిగా ఉందో లేదో చూపించడం తప్పనిసరి. అదనపు డబ్బులు అడిగితే వినియోగదారులు వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఇందుకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 233 3555 లేదా ఇండియన్ కన్స్యూమర్, హెచ్పి పే, హలో బిపిసిఎల్ వంటి అధికారిక యాప్‌లలో గ్రీవెన్స్ కంప్లైంట్ సెక్షన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## ఎలిగేడు లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**ఎలిగేడు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో ఫోటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ 187వ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, యూనియన్ గౌరవ అధ్యక్షుడు కోరుకంటి వెంకటేశ్వర్, సీనియర్ ఫోటోగ్రాఫర్ కట్ల మల్లేశం, అధ్యక్షుడు ముంజంపల్లి శ్రావణ్, ప్రధాన కార్యదర్శి వాకిటి సంతోష్ కుమార్, కోశాధికారి గజ్జల గణేశ్, ఉపాధ్యక్షుడు ముంజంపల్లి మహేందర్, సమాచార కార్యదర్శి కనుకుంట్ల రాజుతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**కల్వకుర్తి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్ట్ ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి మాట్లాడుతూ, అర్థశాస్త్రం, భౌతిక శాస్త్రం, చరిత్ర, వృక్షశాస్త్రం విభాగాలకు చెందిన విద్యార్థులు శాస్త్ర సాంకేతిక, సామాజిక, ఆర్థిక చరిత్ర అంశాలపై క్షేత్రస్థాయి సమాచారంతో అధ్యయనాలు చేసి ప్రదర్శించారని తెలిపారు. ప్రాజెక్టుల రూపకల్పన, పరిశోధన విధానం, డేటా విశ్లేషణ, ఫలితాలు, సూచనలను విద్యార్థులు న్యాయనిర్ణేతలకు వివరించారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. విభాగాల వారీగా ఎంపికైన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో ప్రదర్శించబడటం విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనమని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనివాస్, శ్యాంసుందర్, చంద్రశేఖర్ గౌడ్, డాక్టర్ శ్రీమతిబాయితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం బస్సుల పునఃప్రారంభానికి వినతి



**యాచారం, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరోనా సమయంలో రద్దు చేసిన బస్సులను తిరిగి నడపాలని పీఆర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ బి. సుజాతను కలిసి వినతిపత్రం అందజేసింది. మేడిపల్లి, కొత్తపల్లి, ముద్విన్ ప్రాంతాలకు నైట్ హాల్ట్ బస్సులు పునఃప్రారంభం చేయాలని ఆయన కోరారు. అలాగే తాటిపర్తి నుంచి ఉమెన్స్ కాలేజ్‌కు వెళ్లే బస్సు ప్రస్తుతం ఇబ్రహీంపట్నం వరకే పరిమితం చేయబడిందని, విద్యార్థుల సౌకర్యార్థం అది కాలేజీ వరకు నడవాలని డిమాండ్ చేశారు. "కరోనా సమయంలో నిలిపివేసిన బస్సులను తిరిగి నడపడం అత్యవసరం. గ్రామీణ ప్రజలు, విద్యార్థులు, మహిళలు, కూలీలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు" అని రవీందర్ గుప్త పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి, మల్కిజ్‌గూడ గ్రామాలకు చెందిన శోభ, రాణి, ప్రియక, జంగయ్య పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు బిక్కుమాండ్ల ముత్యాలు వర్ధంతి



**వెల్దండ, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, వెల్దండ గ్రామ తొలి సర్పంచ్ బిక్కుమాండ్ల ముత్యాలు వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ--వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముత్యాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత కేజీబీవీ పాఠశాల పరిధిలోని ఆయన సమాధి వద్ద, నల్లాల బావి దగ్గర ఉన్న విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి గౌరవం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ నాయకుడు ఎన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, బిక్కుమాండ్ల శ్రీనివాసులు, ఉప సర్పంచ్ శ్రీను, ఉప్పు ఆంజనేయులు, వార్డు సభ్యులు వెంకటేష్, పురుషోత్తం చారి, మల్లేశ్వరి రంగనాథం, ముదిగొండ రమేష్, రాఘవరెడ్డి, బాదేపల్లి రమేష్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టియు నూతన కమిటీ ఎన్నిక



**మర్రిగూడ, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పి ఆర్ టి యు మండల సర్వ సభ్య సమావేశంలో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాల్వాయి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మాస. బాలరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా బాలాజీ నాయక్, మహిళా అసోసియేట్‌గా జి. సభిత, కార్యదర్శిగా సతీష్ రెడ్డి ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపిన పాల్వాయి వెంకట్ రెడ్డి, "ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను" అని అన్నారు.

## మర్రిగూడలో జనగణన 2027పై ప్రత్యేక సమావేశం



**మర్రిగూడ, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జనగణన 2027కు సంబంధించిన మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. మండల తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామస్థాయి పూర్తి సమాచారం వారం రోజుల్లో అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఇంచార్జ్ మున్నయ్య, ఏఎస్ఓ గోవింద్ రెడ్డి, ఎస్సై బి. రాంబాబు, ఎంఈఓ శారద, వైద్యాధికారి డాక్టర్ శాలిని, అంగన్వాడీ సూపర్వైజర్ యశోద, ఏపీవో వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## డిండి గురుకుల పాఠశాల--కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**డిండి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల--కళాశాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ డార్మెటరీ, కిచెన్, స్టోర్ రూమ్, వాష్‌రూమ్స్‌ను పరిశీలించి, "చదువుతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తను తరచూ తొలగించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి జంగయ్యకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ?26 లక్షల సివిల్ పనుల నిధులను వినియోగించి డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, భవన మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని డీఈ శైలజకు సూచించారు. స్టోర్ రూమ్‌లో సరుకుల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, గడువు ముగిసిన సరుకులు వాడరాదని, తాజా కూరగాయలు మాత్రమే వాడాలని ప్రిన్సిపాల్ శిరీషకు ఆదేశించారు. వంటవారికి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, గ్లౌజులు, తలకు కవర్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. బాలికలకు ఆత్మరక్షణలో భాగంగా కరాటే శిక్షణ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి చదువు సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంపిడివో వైజన, ఎస్సై బాలకృష్ణ, ఏఈ లస్కర్, సర్పంచ్ రవి, బీజేపీ కన్వీనర్ ఆమనగంటి కృష్ణ, బీఆర్ఎస్ మాజీ యూత్ ప్రెసిడెంట్ రసీదు తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహనలో ఆరు కొత్త రెగ్యులర్ పీజీ కోర్సులు



**కరీంనగర్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ ప్రత్యేక చొరవతో, నిరంతర శ్రమ ఫలితంగా 2026--27 విద్యాసంవత్సరం నుండి ఆరు కొత్త పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులు రెగ్యులర్ విధానంలో ప్రారంభం కానున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంపిన ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేన, ఐఏఎస్ ఆమోదించారు. ఈ కొత్త కోర్సులు కామర్స్ కళాశాలలో రెండు, సైన్స్ కళాశాలలో రెండు, ఆర్ట్స్ కళాశాలలో ఒకటి, గోదావరిఖని పీజీ కళాశాలలో ఒకటి ప్రారంభం కానున్నాయి. ఉపకులపతి ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, "బిజినెస్ అనలిటిక్స్, ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్, ఫుడ్ సైన్స్ వంటి ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను రెగ్యులర్ పద్ధతిలో అందించడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. శాతవాహన విశ్వవిద్యాలయం తెలంగాణలో మెరుగైన ఉన్నత విద్యకు పునాదులు వేస్తోంది" అని పేర్కొన్నారు.

## కెమెరా సృష్టికర్తకు కడ్తాల్ ఫోటోగ్రాఫర్ల ఘన నివాళి

**- ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వేడుకలు..**

**- జెండా ఆవిష్కరణతో పాటు మొక్కలు నాటిన ఫోటోగ్రాఫర్లు**



**ఆమనగల్లు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడ్తాల్ మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యం లో తెలంగాణ ఫోటో అండ్ వీడియో అసోసియేషన్ జెండాను ఆవిష్కరించి ఎగురవేశారు. అనంతరం కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగం ప్రాధాన్యతను గుర్తుచేసుకున్న ఫోటోగ్రాఫర్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఫోటోగ్రఫీ వృత్తిలో ఉన్నవారు ఐకమత్యంతో ముందుకు సాగుతూ పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీశైలం, భీష్మాచారి, రబ్బాని, నదీమ్, శివ, కృష్ణ, మహేష్, నవీన్, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాలు



**కల్వకుర్తి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని శ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ ఫౌండర్ కల్వ మనోహర్ తెలిపారు. ఈ నెల 20న శ్రీదేవి--భూదేవి అమ్మవార్లకు విశేష స్నపన తిరుమంజనం జరగనుంది. భక్తులు తమ శక్తి మేరకు పాలు, పెరుగు, తేనె, చక్కెర, నెయ్యి, పండ్లు, పసుపు, వస్త్రాలు సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 21న శ్రావణ శుక్రవారం సందర్భంగా స్వామివారికి విశేష స్నపన తిరుమంజనం, సామూహిక వరమహాలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించబడుతుంది. వ్రతంలో పాల్గొనే భక్తులు ఉదయం 10:30 గంటలకు దేవస్థానానికి విచ్చేయాలని సూచించారు. అదే రోజు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించవచ్చని తెలిపారు. స్వామివారి విశేష కైంకర్యాలలో అలంకరణ, తోమాల సేవ, తులసి నామార్చన, సుప్రభాత సేవ, శాత్తుముర్తై సేవ, కాలం ఆరాధ, తీర్థ గోష్టి, ప్రసాద వితరణ ఉంటాయని వివరించారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

## ఫుట్‌పాత్ చిరు వ్యాపారుల జీవనోపాధి కాపాడాలి సిపిఎం




**నల్లగొండ, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతామనే పేరుతో ఫుట్‌పాత్ చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయొద్దని సిపిఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్ హెచ్చరించారు. బుధవారం సిపిఎం పట్టణ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ, "నల్గొండ పట్టణంలోని హైదరాబాదు రోడ్డు, పెదగడియారం నుండి స్టేడియం వరకు, దేవరకొండ రోడ్డు తదితర ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాయి. వీరికి ప్రత్యామ్నాయ స్థలాలు, దుకాణ సముదాయాలు నిర్మించి ఇవ్వకుండా ఆకస్మికంగా దాడులు చేసి సరుకులు చిందరవందర చేయడం అన్యాయం" అని అన్నారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు నిర్మించడం మాత్రమే కాకుండా ఉపాధి అవకాశాలను పెంచడం కూడా ఒక భాగమని ప్రభుత్వాలు గుర్తించాలని వారు సూచించారు. అంతర్గత రోడ్లు, కాలనీలలో వార్డు కార్యాలయాలకు లింకు రోడ్లు లేని దుస్థితి ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా రోడ్లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి ప్రత్యామ్నాయ స్థలాలు లేదా దుకాణ సముదాయాలు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం సురేంద్రమోహన్




**నాగర్‌కర్నూల్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు కే. సురేంద్రమోహన్ సూచించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం జరిపి, "అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు, పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలి. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం" అని పేర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటు వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, అర్హులైన ప్రతి ఓటరికి హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. రానున్న మూడు రోజుల పాటు ఓటర్ జాబితా సవరణలకు సంబంధించిన దరఖాస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, ఆర్డీవోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సూపరింటెండెంట్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్లకు ఉచిత నైపుణ్య శిక్షణ

**– ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణకు సుంకిరెడ్డి హామీ**



**కల్వకుర్తి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి డివిజన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తి పట్టణంలోని లయన్స్ క్లబ్ భవన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహిఓచారు. కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన రాఘవేందర్ రెడ్డి.. ఫోటోగ్రఫీ రంగం ప్రాధాన్యతను వివరించారు. ఫోటోగ్రఫీ ఆవిర్భావం నుంచి నేటి ఆధునిక డిజిటల్ ఫోటోగ్రఫీ వరకు ఈ రంగం అనేక సాంకేతిక మార్పులను సంతరించుకుందని అన్నారు. ఒకప్పుడు జ్ఞాపకాలను చిత్రాల రూపంలో భద్రపరచడానికే పరిమితమైన ఫోటోగ్రఫీ.. ప్రస్తుతం ఆధునిక కెమెరా టెక్నాలజీ, వీడియో గ్రాఫీ, డ్రోన్ ఫోటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ, ఫోటో--వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ వంటి విస్తృత రంగాలుగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కెమెరా వినియోగంపై మాత్రమే కాకుండా ఆధునిక సాఫ్ట్‌వేర్, ఎడిటింగ్, డిజైనింగ్, వీడియో ప్రొడక్షన్ తదితర నైపుణ్యాలపై కూడా పట్టు సాధించడం అత్యవసరమని రాఘవేందర్ రెడ్డి సూచించారు. సాంకేతికత రోజురోజుకూ మారుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కల్వకుర్తి, పరిసర ప్రాంతాల్లోని ఫోటో, వీడియో గ్రాఫర్ల నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో ప్రత్యేక నైపుణ్య శిక్షణ కోర్సును ఉచితంగా ఏర్పాటు చేయ నున్నట్లు రాఘవేందర్ రెడ్డి ప్రకటించారు. ఫోటో ఎడిటింగ్, వీడియో ఎడిటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, కలర్ గ్రేడింగ్, సినిమాటోగ్రఫీ, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ తదితర ఆధునిక అంశాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందించేలా కోర్సును రూపొందిఓచను న్నట్లు తెలిపారు. శిక్షణకు అవసరమైన అధునాతన సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చడంతో పాటు, నిపుణులైన శిక్షకులతో ప్రాక్టికల్ శిక్షణ ఇప్పించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ కేవలం సర్టిఫికెట్‌కే పరిమితం కాకుండా.. ఫోటోగ్రఫీ, వీడియో రంగాల్లో వృత్తిపరంగా ఉపయోగపడేలా, ఉపాధి మరియు ఆదాయ అవకాశాలను మెరుగుపరిచే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. "కాలంతో పాటు టెక్నాలజీ మారుతోంది. టెక్నాలజీ మారుతున్న కొద్దీ మన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలి. ఫోటోగ్రఫీని వృత్తిగా కొనసాగిస్తున్న వారికి ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, వారి వృత్తిపరమైన అభివృద్ధికి నా వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఫోటో, వీడియో గ్రాఫర్లకు ఆధునిక నైపుణ్యాలను ఉచితంగా అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ ముందుకు రావడం పట్ల యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగినేని రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎండీ రియాజ్, ప్రధాన కార్యదర్శి నందు, కోశాధికారి వంశీతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు, యూనియన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ యాదగిరిపల్లిలో జీకే ప్రొడక్షన్స్ మూవీ ప్రారంభోత్సవం



**మిర్యాలగూడ, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాదగిరిపల్లి గ్రామంలో జీకే ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ బ్యాక్‌డ్రాప్, మెసేజ్ ఓరియెంటెడ్ మూవీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, బీజేపీ టూ టౌన్ అధ్యక్షుడు పెద్దబోయిన వీటి యాదవ్, చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. నిర్మాతలు కూరాకుల రవీంద్రనాథ్, రేణు మాధవ్, దర్శకుడు శ్రీరామ్ (స్టోరీస్ స్కిన్‌తో) ప్రత్యేకంగా హాజరయ్యారు. గ్రామస్థులు పద్మా రెడ్డి, సైదాచారి, చంద్రయ్య, అంజి, బ్రహ్మచారి తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభోత్సవానికి విశేషంగా తోడ్పడ్డారు.

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ పట్టివేత



**కల్వకుర్తి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. పక్క సమాచారం ఆధారంగా కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతిపేట్ శివారులో వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ, "అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేది లేదు, కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.

# జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై సమీక్ష



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ ఆహార భద్రత చట్టం--2013 అమలుపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలి" అని సూచించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని, రేషన్ దుకాణాల్లో సరుకుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ వివరాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. "అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా ఆహార భద్రత ప్రయోజనాలకు దూరం కాకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పరిశుభ్రమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందేలా చూడాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సేవలను పరిశీలించి, నాసిరకం గుడ్లు సరఫరా అవుతున్నాయని గుర్తించి, నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు మాతృత్వ ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. "ప్రజలకు అందాల్సిన సేవల్లో శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ఎలాంటి జాప్యం జరగకూడదు" అని గోలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, "ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కమిషన్ గుర్తించిన లోటుపాట్లను సరిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, శారదా, అదనపు కలెక్టర్లు బి. చేన్నయ్య, దేవ సహాయం, పౌరసరఫరాల శాఖ అధికారి హైదర్ అలీ ఖాన్, సివిల్ సప్లై డీఎం రాజేందర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పాండు, విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శంకరయ్య కుటుంబానికి పరామర్శ



**ఎలిగేడు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కోడూరు శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాల్వ శ్రీరాంపూర్ మాజీ జడ్పీటిసి గోపగాని సారయ్య గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా శంకరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, శంకరయ్య కుమారులు కోడూరి సత్యనారాయణ, శ్రీశైలం మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులతో మాట్లాడి వారి చదువు ప్రణాళిక, ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, డిజిటల్ వనరుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, "గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలి. పుస్తకాలతో పాటు దినపత్రికలు, డిజిటల్ వనరులను ఉపయోగించడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలి. సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరం" అని సూచించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన జనరల్ స్టడీస్, చరిత్ర, భూగోళశాస్త్రం, భారత రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, విజ్ఞానశాస్త్రం వంటి పుస్తకాల లభ్యతను ఆయన పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లోని దినపత్రికలను యువత ఏ విధంగా వినియోగిస్తున్నారో గమనించారు. కలెక్టర్ యువతకు సూచిస్తూ, "ప్రతిరోజూ పునశ్చరణకు సమయం కేటాయించాలి. వారానికి ఒకసారి తమ ప్రగతిని సమీక్షించుకోవాలి. మాక్ టెస్టులు రాయడం, గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షలపై పట్టు సాధించవచ్చు" అని అన్నారు. గ్రంథాలయంలో ప్రస్తుతం 18,108 చరిత్ర పుస్తకాలు, 9,768 తెలుగు పుస్తకాలు, 3,632 ఆంగ్ల పుస్తకాలు, 2,874 హిందీ పుస్తకాలు, 1,726 ఉర్దూ పుస్తకాలు ఉన్నాయని అధికారులు వివరించారు. అదనంగా పోటీ పరీక్షలకు అవసరమైన తాజా సమాచారంతో కూడిన 2,907 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, గ్రంథాలయ సెక్రటరీ వెంకటలై, సంస్థ కార్యదర్శి ఎం. ప్రతాప్, లైబ్రరీయన్ ఆర్. పరమేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రుల సభకు తరలిన ఎలిగేడు కాంగ్రెస్ శ్రేణులు



**ఎలిగేడు, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధరబాబు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు--భవనాల శాఖ మంత్రి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు అనంతరం జరిగిన సభకు ఎలిగేడు మండలం నుండి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, ఎలిగేడు సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్గాల సంతోష్ రావు, మండలంలోని సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# నాసిరకమైన ఆహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి



**కల్వకుర్తి, ఆగస్టు 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న నాసిరకమైన ఆహారం పట్ల రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తేనే విద్యార్థులు పౌష్టికాహారంతో చదువులో ముందుకు సాగుతారు, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి తోడ్పడతారు" అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఫుడ్ కమిషన్ బృందం సభ్యులు ఆనంద్ సరళ, ఆర్డీఓ జనార్ధన్ రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీంతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, కూరగాయలను పరిశీలించి, "ఇలాంటి కూరగాయలు వండితే విద్యార్థులు ఎలా తింటారు?" అని ఉపాధ్యాయులపై మండిపడ్డారు. బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఎండిపోయిన కూరగాయలను చూసి మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ఇవి జంతువులు కూడా తినవు" అని వ్యాఖ్యానించారు. అంగన్వాడి కేంద్రాలు, రేషన్ షాపులు, కళాశాల హాస్టళ్లను కూడా తనిఖీ చేసి, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, రేషన్ సరఫరా, విద్యార్థులకు అందుతున్న మెనూ వివరాలను పరిశీలించారు. జ్యోతిబా పూలే కళాశాల హాస్టల్‌లో మెనూ ప్రకారం చికెన్, మటన్ అందించడం లేదని ఫుడ్ కమిషన్ సభ్యురాలు శారద వార్డెన్‌ను ప్రశ్నించగా, "మీ ఇంటి నుండి తెస్తున్నారా?" అని మండిపడ్డారు. తనిఖీల అనంతరం గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం" అని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

# కార్డియో చేస్తున్నప్పటికీ బరువు తగ్గడం లేదా.. అయితే అందుకు కారణాలు ఇవే..

బరువు తగ్గేందుకు కార్డియో వ్యాయామాలు మంచి మార్గంగా వైద్య నిపుణులు చెబుతుంటారు. నడక, పరుగు, సైక్లింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలు గుండె వేగాన్ని పెంచడంతోపాటు శరీరం ఎక్కువ కేలరీలను ఖర్చు చేసేలా చేస్తాయి. శరీరంలో నిల్వ ఉన్న శక్తిని వినియోగించడం ద్వారా బరువు తగ్గించే ప్రక్రియకు ఇవి సహాయపడతాయి. అయితే ప్రతిరోజూ కార్డియో చేస్తున్నంత మాత్రాన బరువు తప్పకుండా తగ్గుతుందని చెప్పలేం. ఆహారం, మెటబాలిజం, కండరాల పరిమాణం, ఒత్తిడి, రోజువారీ కదలికలు వంటి అంశాలు కూడా బరువు నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. కార్డియో వ్యాయామాల సమయంలో శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది. అయితే వ్యాయామం పూర్తయిన తర్వాత ఆ అదనపు కేలరీల ఖర్చు అదే స్థాయిలో కొనసాగదు. అందువల్ల కార్డియోపై మాత్రమే ఆధారపడకుండా ఆహారం, శక్తి వినియోగం, కండరాల ఆరోగ్యం వంటి అంశాలను కూడా సమతుల్యం చేసుకోవాలి. ధికంగా తినడం..

ప్రతిరోజూ కార్డియో చేస్తున్నప్పటికీ బరువు తగ్గకపోవడానికి ఒక కారణం వ్యాయామం తర్వాత ఎక్కువగా తినడమే. కార్డియో చేసిన తర్వాత ఆకలి పెరగడం సాధారణం. ఈ సమయంలో అవసరానికి మించి కేలరీలు తీసుకుంటే వ్యాయామం ద్వారా ఖర్చైన కేలరీలను తిరిగి భర్తీ చేసే అవకాశం ఉంటుంది. ఫలితంగా బరువు తగ్గడానికి అవసరమైన కేలరీ లోటు ఏర్పడదు. మరో కారణం మెటబాలిక్ అడాప్టేషన్. శరీరం ఒకే రకమైన వ్యాయామానికి అలవాటు పడినప్పుడు అదే వ్యాయామాన్ని గతంలో కంటే మరింత సమర్థవంతంగా చేయడం ప్రారంభించవచ్చు. దాంతో అదే స్థాయి వ్యాయామానికి శరీరం తక్కువ శక్తిని ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. దీని వల్ల కొంతకాలం తర్వాత బరువు తగ్గే వేగం



తగ్గుతుంది. అధికంగా కార్డియో చేయడం వల్ల కండరాల పరిమాణం తగ్గే అవకాశం కూడా ఉంటుంది. కండరాలు తగ్గినప్పుడు విశ్రాంతి సమయంలో శరీరం ఖర్చు చేసే శక్తి కూడా తగ్గుతుంది. దీంతో బరువును తగ్గించుకోవడం లేదా కొనసాగించడం మరింత కష్టంగా మారుతుంది. అందుకే బరువు తగ్గే ప్రయత్నాల్లో కండరాలను కాపాడుకోవడం కూడా ముఖ్యమే. కదలికలు తక్కువగా ఉండడం.. వ్యాయామం చేసే సమయం మినహా మిగిలిన రోజంతా కదలికలు తగ్గిపోవడం మరో కారణం అవుతుంది. కొందరు వ్యాయామం చేసిన తర్వాత ఎక్కువసేపు కూర్చోవడం లేదా విశ్రాంతి తీసుకోవడం వల్ల రోజువారీ కదలికలను తగ్గించుకోవచ్చు. నడక, ఇంటి పనులు వంటి వ్యాయామం కాకుండా చేసే శారీరక కదలికలు కూడా రోజువారీ కేలరీల వినియోగంలో ముఖ్యమైన భాగమే. అధిక ఒత్తిడి కూడా బరువు నియంత్రణపై ప్రభావం చూపిస్తుంది. ఒత్తిడి పెరిగినప్పుడు కార్టిసాల్ వంటి హార్మోన్ల స్థాయిలు పెరుగుతాయి.



# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

**- వాయిదా వార్తలను ఖండించిన టీమ్**

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# వియత్నాం టూర్‌లో సమంత, రాజ్ నిడుమోరు



టాలీవుడ్ స్టార్ నటి సమంత ప్రస్తుతం వియత్నాంలో తన భర్త, ప్రముఖ దర్శక-నిర్మాత రాజ్ నిడిమోరు తో కలిసి బేబీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే తాము మొదటి బిడ్డకు స్వాగతం పలకబోతున్న నేపథ్యంలో, ఈ ప్రత్యేకమైన క్షణాలను ఆస్వాదించేందుకు ఈ క్యూట్ కపుల్ వియత్నాం వెకేషన్‌కు వెళ్లారు.అక్కడి సుందరమైన ప్రదేశాలను చుట్టేయడంతో పాటు, పలు రకాల ఫన్ యాక్టివిటీస్‌లో సమంత ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే అక్కడి ప్రత్యేకమైన స్థానిక ఫుడ్‌ను టేస్ట్ చేస్తూ ఎంజాయ్ చేసిన వీడియోలు, ఫోటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ బేబీమూన్ పిక్స్ మరియు వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా, టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్



పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# టాక్సిక్ .. పెద్దల సినిమా మాత్రమే

**- పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్**

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.

# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్



అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.

# ఓటిటిలోకి శ్రీనివాస మంగాపురం

తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే




ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.